

140 250 మీటర్లా?

- అమరావతి ఓఆర్ఆర్ వెడల్పుపై స్పష్టత కరువు
- గతంలో 140 మీటర్లకే కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- 250 మీటర్ల భూసేకరణకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదన
- గగ్గోలు పెడుతున్న రోడ్డు ఎలైన్‌మెంట్ బాధిత రైతులు

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమరావతి అవుటర్ రింగురోడ్డు(ఓఆర్ఆర్) వెడల్పుపై స్పష్టత కొరవడింది. కొన్ని నెలల క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ 140 మీటర్ల వెడల్పునకు తుది డీపీఆర్‌ని ఆమోదించింది. అయితే ఇప్పుడు ఆ వెడల్పు కూడా చాలదన్నట్లు బఫర్ జోన్ పేరుతో జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) 250 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం కోసం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవకు నివేదించింది. జేసీ ఆమోదం తెలిపితే సర్వే నంబర్లతో భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదలకు రెవెన్యూ యంత్రాంగం సన్నద్ధమైంది. అయితే ఓఆర్ఆర్ కోసం పావు కిలోమీటర్ వెడల్పు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల ఎకరాలకు ఎకరాలు భూములు కోల్పోతామని గగ్గోలు పెడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 140 మీటర్లకే లోబడి భూసేకరణ చేసుకోవాలని కోరుతున్నారు. రాజధానికి మణిహారంగా ఉండేలా చేసేందుకు అవుటర్ రింగు రోడ్డుని ఏపీసీఆర్‌డీఏ ప్రతిపాదించింది. దాదాపుగా 190 కిలో మీటర్ల పొడవునా గుంటూరు, పల్నాడు, ఉమ్మడి కృష్ణ జిల్లాల మీదగా దీని ఎలైన్‌మెంట్‌ని రూపొందించారు. ఈ ప్రాజెక్టు ఖర్చు రూ.24,791 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో భాగంగా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజ్ ఎగువున, దిగువున రెండు పొడవాటి బ్రిడ్జిలు, రిజర్వు ఫారెస్టులో టన్నెల్స్ రెండు స్పేర్ రోడ్లను నిర్మించేందుకు ప్రతిపాదించారు. మొత్తం 12 ప్యాకేజీలుగా ఓఆర్ఆర్ పనులను విభజించి టెండర్లు పిలిచేందుకు నిర్ణయించారు. తొలుత 100 మీటర్ల వెడల్పుతోనే రింగురోడ్డుని నిర్మించాలని భావించారు. అయితే భవిష్యత్‌లో రైలుమార్గం, ఇతరత్రా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో (మిగతా 6వ పేజీలో)

నేడే.. సుఖీభవ

అన్నదాతలకు ఆర్థిక సాయం

- 2,40,530 మందికి రూ.168.37 కోట్లు
- అర్హుల బ్యాంకు ఖాతాలకు రెండో విడత జమ




జిల్లాలో 2,40,530 మంది రైతులను అధికారులు సుఖీభవకు అర్హులుగా నిర్ధారించారు. వీరికి రూ.168.37 కోట్లు పంపిణీ చేయనున్నారు. తొలివిడత 2,39,959 మందికి సుఖీభవ అందజేశారు. రెండో విడతలో లబ్ధిదారులు 571 మంది పెరిగారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతులకు శుభవార్త. పీఎం-కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను ప్రభుత్వం బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం-కిసాన్ పథకం కింద రూ.2,000 కలిపి మొత్తం రూ.7,000 అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయడానికి వ్యవసాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. మండల, నియోజకవర్గ స్థాయితో పాటు జిల్లా స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. సుఖీభవ సొమ్ము పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజాప్రతినిధులు సుఖీభవ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులకు వివరించనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.7 వేల సాయం రబీలో పంటల సాగుకు ఉపయోగపడనున్నాయి. సుఖీభవ పథకం రెండో విడత డబ్బు తమ బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ (మిగతా 6వ పేజీలో)

నియోజకవర్గాల వారీగా సుఖీభవ అర్హుల ఇలా..

నియోజకవర్గం	అర్హుల సంఖ్య	పెట్టుబడి సాయం
సత్తెనపల్లి	36,752	25.72
నరసరావుపేట	20,463	14.32
చిలకలూరిపేట	21,669	15.16
పెదకూరపాడు	41,149	28.80
గురజాల	35,676	24.97
వినుకొండ	45,898	32.12
మాచర్ల	38,923	27.24



ఇదేం ప్రశ్నపత్రం

- చేతిరాతపై విద్యార్థుల అవాక్కు
- పునరావృతం కాదన్న పీజీ కోఆర్డినేటర్

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. అదేదో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు సంబంధించినవి కాదు. అలాంటి పరీక్షలకు సంబంధించి కూడా అధికారులు అప్రమత్తంగా ఉంటారు. అలాంటిది పీజీ కోర్సులకు సంబంధించి, అదీ విద్యార్థులకు కీలకమైన సెమిస్టర్ పరీక్షలంటే ఎంతో జాగ్రత్తగా ఉంటారు. అయితే ఘనత వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్లక్ష్య ధోరణి వీడటంలేదు. వర్సిటీ పరీక్షల విభాగం నిర్లక్ష్యం ఎంత అధ్వానంగా మారిందంటే సెమిస్టర్ పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా చేతిరాతతో ఇచ్చారు. పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు చేతిరాతతో ఇచ్చిన ప్రశ్నపత్రం చూసి అవాక్కయ్యారు. వర్సిటీలో మంగళవారం పీజీ ఆర్ట్స్ సైన్స్, ఎంబీఏ, ఎంసీఏలతో పాటు ఎల్.ఎల్.బీ కోర్సులకు సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే సైన్స్ విభాగం ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ప్రశ్నపత్రం చేతితో రాసినది చూసి విద్యార్థులు విస్తుపోయారు. చివరకు విద్యార్థులకు నచ్చచెప్పిన అధ్యాపకులు వారితో పరీక్ష రాయించారు. ఆ ప్రశ్నపత్రాన్ని చూసి అధ్యాపకులు కూడా కంగుతున్నారు. ఈ ప్రశ్నపత్రంపై ఆరా తీయగా గతంలో ప్రశ్నపత్రాల లీకేజ్‌కి సంబంధించిన అధ్యాపకుడే కారణమని తెలిసింది. దీనితో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. దీనిపై పీజీ కోఆర్డినేటర్ సుబ్బారావును వివరణ కోరగా సమయం తక్కువ ఉండటంతో రాత పూర్వకంగా ఇచ్చినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.



మావోల షెల్టర్‌పై.. ఉలికిపాటు

- కలకలం రేపిన విజయవాడ ఘటన
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులపై పోలీసుల ఆరా
- నాడు మావోలకు పెట్టనికోటగా పల్నాడు, నల్లమల ప్రాంతం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని తోపాటు రాష్ట్రంలోనే అత్యంత కీలక ప్రాంతం విజయవాడలో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్న ఉదంతం పోలీస్ శాఖతో ప్రజలను కూడా ఉలిక్కిపడేలా చేసింది. విజయవాడలో ఏకంగా 27 మంది మావోయిస్టులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనంగా మారింది. గతంలో రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలోనూ విజయవాడ లాంటి నగరంలో ఇంత భారీ సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన పరిస్థితి లేదు. ప్రధానంగా ఛత్తీస్‌ఘడ్, ఏవోబీ ప్రాంతాల్లో కేంద్ర పోలీస్ బలగాల ముప్పేట దాడులతో ఇప్పటికే మావోయిస్టులు ఉనికి కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వందలాది మంది ఎన్‌కౌంటర్లలో హతమవగా, అదే స్థాయిలో లొంగుబాటు పర్వం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఊహించని విధంగా మావోయిస్టుల అత్యంత కీలక నేత హిడ్మా సహా ఆరుగురు ఎన్‌కౌంటర్లో మృతి చెందడం... అదే సమయంలో విజయవాడలో 27 మంది పోలీసులకు పట్టుబడటం కలకలం రేపింది. ఈ ఘటన నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది.

గతంలో నల్లమల కీలకమైన ప్రాంతం

ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోటగా... షెల్టర్ జోన్‌గా ఉన్న నల్లమల ప్రాంతంలో దాదాపు ఒకటిన్నర దశాబ్దంగా వారి ఉనికే లేకుండా పోయింది. గతంలో నల్లమల కేంద్రంగా మావోయిస్టులు కార్యకలాపాలు సాగించారు. నల్లమలను ఆనరాగ పల్నాడు ప్రాంతంలో పూర్తిస్థాయిలో విస్తరించి పోలీస్ శాఖకు సవాల్‌గా నిలిచారు. దివంగత మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్కే పల్నాడు ప్రాంతవాసి కావడంతో ఈ ప్రాంతంపై మావోయిస్టులు తమదైన శైలిలో ముద్రవేశారు. అటు తెలంగాణ సరిహద్దు జిల్లాలతో పాటు ఇటు ఏపీలోని సరిహద్దు జిల్లాల మధ్య విస్తరించి ఉన్న నల్లమల ప్రాంతం గతంలో మావోయిస్టులకు షెల్టర్‌జోన్‌గా ఉంది. ఇక్కడ నుంచే మావోయిస్టులు పెద్దఎత్తున కార్యకలాపాలు సాగించారు. 2004లో ప్రభుత్వంతో మావోయిస్టు చర్చలు విఫలం తర్వాత మావోయిస్టుల అనుపానులు తెలుసుకుని నల్లమలలో వారి షెల్టర్‌కు గండి కొట్టారు. దీంతో వారంతా ఈ ప్రాంతాన్ని వదిలి ఏవోబీ వైపు వెళ్లారు. 2010 నుంచే పల్నాడు ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కనుమరుగవుతూ వచ్చాయి. అదే సమయంలో తెలంగాణలో కూడా పూర్తిగా మావోయిస్టు కార్యకలాపాలను అణిచి వేయడంతో ఏపీ, తెలంగాణలో మావోయిస్టులకు షెల్టర్ లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో తాజాగా విజయవాడలో 27 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో పరిస్థితులు చర్చనీయాంశమయ్యాయి. అయితే విజయవాడలో మావోయిస్టులు పట్టుబడిన సందర్భాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఛత్తీస్‌ఘడ్, ఏఓబీ ప్రాంతంలో పోలీస్ దాడులు పెరగడంతో ప్రాణ రక్షణ కోసం మావోయిస్టులు మైదాన ప్రాంతం వైపు వచ్చి ఉంటారని... పరిస్థితులు అనుకూలిస్తే లొంగిపోవాలని భావించి ఉంటారని పోలీసు వర్గాలు అంటున్నాయి. నల్లమల ప్రాంతంలో మావోయిస్టుల ఉనికే లేదని.. అలాగే పల్నాడు ప్రాంతంలో వారికి షెల్టర్ అవకాశమే లేదని నిఘావర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా రహస్యంగా ఈ ప్రాంతానికి వచ్చినా ప్రజలే పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టించే పరిస్థితులు ఉన్నాయంటున్నారు.

హరిత పల్నాడు ఆవిష్కృతం చేయాలి

- వనం - మనం విస్తృతంగా అమలు చేయాలి
- జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాను హరిత పల్నాడుగా ఆవిష్కృతం చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా అటవీశాఖ అధికారులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం వనం-మనం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనం- మనం కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలన్నారు. పచ్చదనం సాధనలో అన్ని శాఖలు సమష్టిగా, సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యా సంస్థలు, కార్యాలయాలు, ఖాళీ స్థలాలలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన, సాధించిన లక్ష్యాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలో మొక్కలు నాటేందుకు కార్యాచరణ సమర్పించాలన్నారు. అటవీశాఖ, హార్టికల్చర్, సెరికల్చర్, పీడీ డ్వామా, ఐటీసీ, పాఠశాలలు, ఎన్జీవోలు ఇతర ఏజెన్సీల ద్వారా హరిత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారి క్రిష్ణప్రియ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఉన్నతితో.. వడ్డీలేని రుణాలు

స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా డైరెక్టర్ నీలోఫర్

నరసరావుపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా డైరెక్టర్ నీలోఫర్ తెలిపారు. యువతకు ఉపాధి, ఉద్యోగ నైపుణ్యాభివృద్ధిపై మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక బరంపేటలోని షాదీఖానా హాలులో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నీలోఫర్ మాట్లాడుతూ చదువు ఆపేసి వివాహం చేసుకున్న మహిళలు ఉన్నతి పథకం ద్వారా వ్యాపారవేత్తలుగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువత యువకులు చేతి వృత్తుల ఆధారంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. కంప్యూటర్ నెట్ వర్కింగ్ డెస్క్‌టాప్ పబ్లిషింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, హౌస్ వైరింగ్ వంటి 20 రకాల వృత్తులు ఆధారంగా యువత ఆదాయం పొందవచ్చన్నారు. ఈ 20 రకాల కోర్సులకు సంబంధించి యూనియన్ బ్యాంక్ ఉచితంగా శిక్షణతో పాటు రుణాలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా డీపీఎం వీరస్వామి మాట్లాడుతూ ఈ నెల 25న నరసరావుపేటలో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ ఏపీఎం భరత్, పల్నాడు, గుంటూరు జిల్లాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్లు సాంబయ్య, కోటిరత్నం, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ ఎస్ నీలోఫర్

ఎన్టీఆర్ కాలనీకి రహదారి

- రోడ్డుకు రూ.85 లక్షల ఉపాధి నిధులు
- పనులకు మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన

ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ఉప్పలపాడు రహదారిలోని ఎన్టీఆర్ కాలనీ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టారు. కష్టాల.. కాలనీ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. రూ.85 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పనులకు ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేశారు. వినుకొండ రోడ్డు నుంచి కాలనీ వరకు నిర్మిస్తారు. కార్యక్రమంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కష్టాల.. కాలనీ

ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్త



రహదారి నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



6

వెంకటపాలెం టీటీడీ దేవస్థానానికి నిధులు

- రూ. 90 కోట్లు కేటాయించిన టీటీడీ పాలక మండలి
- ఈ నెల 27న సీఎం పనులను ప్రారంభించే అవకాశం



6

వీరులను స్మరించుకుంటూ..

- నేటి నుంచి వీరారాధన ఉత్సవాలు ప్రారంభం

పొడి వాతావరణంలో పత్తి తీయాలి

- పొలాల పరిశీలన.. రైతులకు లాం శాస్త్రవేత్తల సూచన

క్రోసూరు, బెల్లంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొడి వాతావరణంలో పత్తిని తీయాలని, తేమ ఎక్కువగా ఉంటే నీడలో ఆరబెట్టుకోవాలని లాం ఫాం శాస్త్రవేత్తలు తెలిపారు. లాం శాస్త్రవేత్తల బృందం మంగళవారం క్రోసూరు మండలం క్రోసూరు, ఎర్రబాలెం, బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం, వన్నాయపాలెం గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామాల్లోని పత్తి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. సస్యరక్షణ చర్యలు పాటిస్తే నష్టాల బారిన పడకుండా ఉంటారన్నారు. కాయ పగిలే దశలో ఉంటే ఒక లీటరు నీటిలో సైపర్ మైత్రిన్ ఒక మిల్లీలీటరు కలిపి పిచికారి చేయాలన్నారు. కాయ కుళ్లను తగ్గించడానికి మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మొక్కల కింద భాగంలో కాయలు తడిచేలా పిచికారి చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు వృద్ధి చెందకుండా మూడు గ్రాముల యాంకోజబ్ పిచికారి చేయాలని సూచించారు. పూత, గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లోనోఫిక్స్‌ను పిచికారి చేయాలన్నారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ పత్తిని విక్రయించుకునే వారు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ క్రాపులో నమోదు చేసుకున్న వారే సీసీఐ కేంద్రాల్లో పత్తిని విక్రయించుకునేందుకు అర్హత ఉంటుం దన్నారు. పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందంలో వీ మనోజ్ కుమార్, డాక్టర్ ఎల్ రాజేష్ చౌదరి, సీహెచ్ నాగజ్యోతి ఎస్ సౌజన్య, శ్రీ వైష్ణవి, మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్, ఏవో అరుణ కుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది కేవీ శ్రీనివాసరావు, సీహెచ్ సౌజన్య, సాయి, భానుకిరణ్, రహ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

జాబ్ మేళాకు విశేష స్పందన

మాచర్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో పది కంపెనీలు పాల్గొనగా 173 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీకుమారి, జిల్లా ఉద్యోగ కల్పనాధికారి ఎం రవీంద్రనాయక్, కిరణ్, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు

రవీంద్రబాబుకు పీహెచ్‌డీ ప్రదానం



ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాల యంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన యంద్రపాటి రవీంద్రబాబుకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. డాక్టర్ ఓ.నాగరాజు పర్యవేక్షణలో అడాప్టివ్ రీసోర్స్ మేనేజ్మెంట్, వర్క్ ఫ్లో ఆప్టిమైజేషన్ ఇన్ బిగ్ డేటా సిస్టమ్స్, యూజింగ్ ఇంటిగ్రేటెడ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ అనే అంశంపై రవీంద్రబాబు పరిశోధనా గ్రంథాన్ని సమర్పించి పీహెచ్‌డీని పొందారు. పీహెచ్‌డీ పట్టాను పొందిన రవీంద్రబాబును అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఏఎన్‌యూ పరిధిలో పరీక్షలు ప్రారంభం



పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న పీజీ కోఆర్డినేటర్ ఆచార్య సుబ్బారావు

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి ఎంఈడీ, బీఈడీ మూడో సెమిస్టర్, పీజీ సైన్స్, ఆర్ట్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎల్ఎల్‌బీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు నాగార్జున యూనివర్సిటీలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పగడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 5,800 మంది విద్యార్థులు, ఎం ఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలకు 150మంది, లా పరీక్షకు 700 మంది, స్పెషల్ బీఈడీ పరీక్షకు 30 మంది, పీజీఆర్ట్స్అండ్ సైన్స్ పరీక్షకు 3,675 విద్యార్థులు హాజరయ్యారు.

వెంకటపాలెం టీటీడీ దేవస్థానానికి నిధులు

● రూ. 90 కోట్లు కేటాయించిన టీటీడీ పాలక మండలి ● ఈ నెల 27న సీఎం పనులను ప్రారంభించే అవకాశం


గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర వైభవాన్ని అమరావతిలోనే దర్శింపజేసేలా రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఆలయం చుట్టూ భారీ ప్రాకారం, ప్రధాన ముఖద్వారం వద్ద ఏడు అంతస్తులతో మహారాజ గోపురం, మూడు దిక్కుల్లో ఐదు అంతస్తులతో రాజ గోపురాలు, మాడ వీధులు, కల్యాణోత్సవ, కల్యాణ మండపాల నిర్మాణ పనులను ప్రారంభించబోతోంది. ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం రూ. 90 కోట్లు నిధులు కేటాయించడంతో మరో వారం పది రోజుల్లో నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. ఇప్పటికే నిర్మాణాల పనులకు సంబంధించిన టెండరు ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. కాగా, ఈ నెల 27న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

● రూ. 185 కోట్లతో ప్రణాళిక

శ్రీవారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 185 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేసింది. వాటిని ఈ ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీటీడీ అధికారులు వివరించారు. ఆయన ఆమోదముద్ర వేయడంతో అమలుకు పూనుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం రూ.90 కోట్ల నిధులను టీటీడీ విడుదల చేసింది. ఆ నిధులతో ఈ నెల 27న పనులు ప్రారంభించనున్నారు.

● జగన్ కక్షతో నాడు ఆగిన నిర్మాణం

రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని ఏడున్నరేళ్లకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. వెంకటపాలెం వద్ద సీడ్ యాక్సిస్ రోడ్డు, కృష్ణా కరకట్టకు మధ్యలో 25 ఎకరాలను అందుకోసం కేటాయించింది. రూ. 136 కోట్ల అంచనా వ్యయంతో తిరుమలను తలపించేలా శ్రీవారి ఆలయం నిర్మించాలని భావించింది. ఈ ప్రతిపాదనకు తితిదే ధర్మకర్తల మండలి 2018లో ఆమోదం తెలిపింది. ప్రణాళికలు సిద్ధమై పనులు ప్రారంభించిన కొన్నాళ్లకే వైసీపీ అధికారంలోకి వచ్చింది. రాజధానిపై కక్షగట్టి ఎక్కడి పనులు అక్కడే నిలిపేసింది. ఆలయ నిర్మాణానికి కేటాయించిన అంచనాలను రూ. 136 కోట్ల నుంచి 36 కోట్లకు కుదించి, రూ.100 కోట్లను విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో శ్రీవారి ఆలయ నిర్మాణ పనులూ నిలిచిపోయాయి. ప్రధాన ఆలయం, లోపాలి ప్రాకారం, ఒక రాజగోపురం, ధ్వజస్తంభ మండపాలు మాత్రం నిర్మించి మమ అనిపించారు.



నిర్మించనున్న దేవస్థానం వెలుపలి ప్రాకారం, రాజగోపురాల నమూనా ప్లాన్

● అన్ని హంగులతో దేవస్థాన నిర్మాణం

ఏడున్నరేళ్ల క్రితం శ్రీవారి ఆలయాన్ని ఏ స్థాయిలో నిర్మించాలనుకున్నారో దానికి మించి సకల హంగులతో దేవస్థానాన్ని నిర్మించాలని ప్రభుత్వం బావిస్తోంది. అందులో భాగంగా ఇప్పుడు వెలుపలి ప్రాకారాన్నీ నిర్మించనున్నారు. వెలుపలి ప్రాకారానికి తూర్పు దిక్కున ప్రధాన ముఖద్వారం వద్ద 7 అంతస్తులతో మహారాజ గోపురం, పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశల్లో ఐదు అంతస్తుల్లో రాజగోపురాలు నిర్మిస్తారు. వాటితో పాటు కల్యాణోత్సవ, ఉత్సవ మండపాలను నిర్మించనున్నారు. ప్రస్తుతం తొలి దశ పనుల్లో భాగంగా వెలుపలి ప్రాకారం, రాజగోపురాల నిర్మాణాలను చేపట్టనున్నారు.

వీరులను స్మరించుకుంటూ...

● నేటి నుంచి వీరారాధన ఉత్సవాలు ప్రారంభం

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు రాచగావు, 20న రాయబారం, 21న మండపోరు, 22న కోడిపోరు, 23వ తేదీన కల్లిపాడుతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఇప్పటికే పలు జిల్లాల నుంచి వీరాచారవంతులు కారంపూడికి చేరుకున్నారు. తమ పూర్వీకుల ఆయుధాలకు గంగధారమడుగులో స్నానమాచరింపజేశారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, పీఠం నిర్వాహకుడు విజయకుమార్, కూటమి నేతలు, అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పదవీ వ్యామోహం.. దాయాదుల వైరం.. శైవ, వైష్ణవ సంఘర్షణల నేపథ్యంగా క్రీస్తు శకం 12వ శతాబ్దంలో కారంపూడి వేదికగా జరిగిన పల్నాటి యుద్ధానికి ఓ చరిత్ర ఉంది. గతంలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎందరో రాజులు గతించారు. ఎన్నో రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కాని కారంపూడిలో జరిగిన పల్నాటి యుద్ధం మాత్రం నేటికీ ప్రజల హృదయాంతరాలలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. ద్వాపర కాలంనాటి మహాభారతాన్ని తలపిస్తూ సాగిన మారణకాండలో ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా పోరాడి అమరులయ్యారు. ఆనాటి యుద్ధంలో అశువులు బాసిన వీరుల గుండె చప్పుళ్లు ఇప్పటికీ వినబడుతూనే ఉన్నాయి. ఇక్కడ ఏటా జరిగే వీరారాధనోత్సవాల్లో కత్తులు నర్తిస్తాయి. పల్నాటి కథను ఆలపిస్తాయి. సుమారు 900 సంవత్సరాలకు పూర్వం నాయకురాలు నాగమ్మకు, బ్రహ్మనాయుడు వర్గాలకు మధ్య జరిగిన భీకర పోరాటం గుర్తులు నేటికీ చెరిగిపోలేదు. నాటి రాజులు వాడిన ఆయుధాలు, వారి గుర్తుగా శిలలు కారంపూడిలోని వీర్లదేవాలయంలో పల్నాటి చరిత్రకు సజీవసాక్ష్యాలుగా నిలిచాయి. ప్రపంచంలోని రోమ్ నగరం తరువాత మన దేశంలోని కారంపూడిలో మాత్రమే వీరులకు ఉత్సవాలు జరపడం విశేషం



వీర్ల దేవాలయం

● ముస్తాబైన ఆలయాలు

వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అంకాళమ్మ అమ్మవారి ఆలయం, ధ్వజస్తంభం, సూరేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మనాయుడి మేడ, కన్నమదాసు మేడ, వీరుల దేవాలయాలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని వసతులు సమకూర్చారు.

ఎడ్లబండలాగుడు పోటీలు ప్రారంభం

● ఆరుపళ్ల విభాగంలో పల్నాడు జిల్లాకు ప్రథమస్థానం

కారంపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో రెండు తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్లబండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యవారు, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తొలిరోజు ఆరుపళ్ల విభాగంలో పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 14 ఎడ్లజతలు పాల్గొనగా పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత నిర్ణీత వ్యవధిలో 3,538 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన గుదిబండి మాధవరెడ్డి ఎడ్లజత 3,260 అడుగులతో రెండోస్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని కావ్యశ్రీ, మధు ఎడ్లజత 3,250 అడుగులతో మూడో స్థానం, బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం జెపంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత 3,121 అడుగులతో నాలుగో స్థానం, తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన ఆషేష్ సుమన్‌రెడ్డి ఎడ్లజత 3 వేల అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన దేవరపల్లి భార్గవ్‌రెడ్డి ఎడ్లజత 2,983 అడుగులతో ఆరోస్థానం దక్కించుకుంది. సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, గ్రామ పెద్ద కాపు బొమ్మిన శ్రీనివాసరావు, రైతు సంఘం నేతలు సొసైటీ చైర్మన్ నాగవరపు రామకృష్ణ, పలిశెట్టి శ్రీనివాసరావు, చింతపల్లి రామ్మూర్తి, జక్కా నరసింహారావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు చప్పిడి రాము, ఉన్నం లక్ష్మీనారాయణ, తోట నరసింహారావు, బొల్నేడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానం సాధించిన పల్నాడు జిల్లా ఎడ్లజత

నేడే.. సుఖీభవ

(5వ పేజీ తరువాయి)

చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న గందరగోళం

లబ్ధిదారుల సంఖ్యలో తొలి దశలో ఉన్న గందరగోళమే ఇప్పటికీ కొనసాగుతోంది. అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు, పీఎం కిసాన్ లబ్ధిదారులకు మధ్య భారీ సంఖ్యలో వ్యత్యాసం ఉంది. వెబ్‌ల్యాండ్ వంటి సాంకేతిక చిక్కులతో పాటు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పీఎం కిసాన్ లబ్ధిదారుల ఎంపిక జరిగిందని గతంలో యంత్రాంగం చెప్పింది. 2019 నుంచి ఉన్న వెబ్‌ల్యాండ్ డేటానే కేంద్రం ప్రామాణికంగా తీసుకుంటుందని, అందువల్లే లబ్ధిదారుల సంఖ్యలో తేడా ఉందని అధికారులు చెప్తున్నారు. రెండో దశ నిధులు విడుదల నాటికి ఈ సమస్య పరిష్కారం అవుతుందని అప్పట్లో తెలిపారు. కానీ తొలి దశలోని లబ్ధిదారుల సంఖ్యనే ఇప్పుడు కూడా వ్యవసాయశాఖ చూపిస్తోంది. తొలి దశ రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాక, అర్హత కలిగిన ఎవరికైనా సుఖీభవ నిధులు పడకపోతే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దాని ఆధారంగా పలువురు రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వారి అర్హతను నిర్ధారించారు. అయితే తాజా లబ్ధిదారుల్లో వారి పేర్లు కనిపించడంలేదు. అభ్యంతరాల ద్వారా అప్పుడు అర్హులుగా తేలిన వారు, మలి విడతలో ఎందుకు అనర్హులయ్యారనేదానికి వ్యవసాయశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కౌలు రైతుల జాబితాలు ఇంకా సిద్ధం కానట్లు తెలుస్తోంది. కౌలు రైతులకు ఒకేసారి రూ.14 వేలు అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రెండో విడతలో కౌలు రైలుకు సుఖీభవ అందుతుందా లేదా అన్న అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఈ సారి లేకుంటే మూడో విడతలో వారికి సుఖీభవ అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.


140 మీటర్లా.. 250 మీటర్లా?

(5వ పేజీ తరువాయి)

చర్చించి 140 మీటర్ల వెడల్పునకు ఆమోదం పొందారు. కాగా ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఏకంగా 250 మీటర్ల వెడల్పుతో తుది డీపీఆర్‌ని సిద్ధం చేసి కేంద్రం నుంచి ఆమోదం తీసుకుని గుంటూరు జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి నివేదించారు. దీని వల్ల భూసేకరణ ఖర్చులు పెరిగిపోతాయి. పైగా భూమినే నమ్ముకుని తరతరాలుగా జీవిస్తోన్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అలానే పరిశ్రమలు, వాటర్ బాడీస్‌కి కూడా నష్టం జరగొచ్చు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత ఓఆర్ఆర్ ఎలైన్‌మెంట్‌పై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. 140 మీటర్ల వెడల్పులోనే మీడియన్‌తో ఆరు వరుసల రహదారి, ఇరువైపులా సర్వీసు రోడ్లు, రైలుమార్గానికి సరిపోతుంది. అలాంటిది దీని కంటే 110 మీటర్లు అదనంగా భూసేకరణ చేయాలని ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు తమతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కోరుతున్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద ఉధృతి

దిగువకు 725 క్యూసెక్కుల నీటి విడుదల



దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను తగ్గించడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు, ప్రధాన వాగుల నుంచి 9,618 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 725 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,154 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 585.80 అడుగులు ఉంది. ఇది 299.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,097 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,462 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 35,159 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 35,159 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.02 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లీకుల 400 క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సామాన్య భక్తులకు వైకుంఠ దర్శనం హర్షణీయం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజులు పాటు కల్పిస్తూ టీటీడీ ప్రకటించడం హర్షణీయమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డిసెంబరు 30వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు భక్తులకు ఈ ప్రత్యేక దర్శన అవకాశం ఉంటుందని చెప్పారు. పది రోజుల కాలంలో 182 గంటలు దర్శన సమయం ఉండగా.. అందులో 104 గంటలు సాధారణ భక్తులకే ప్రత్యేకంగా కేటాయించడం ఆనందకర మన్నారు. వీవీఐపీలకు, విఐపీలకే లభించే వైకుంఠ ద్వార దర్శనాన్ని సీఎం చంద్రబాబు ఆదేశాలతో సామాన్య భక్తులకు కల్పించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని జీవీ తెలిపారు.

మక్కా ప్రమాదంపై ఎమ్మెల్యే యరపతినేని సంతాపం



పిడుగురాళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన మక్కాయాత్రలో భాగంగా ఉమ్రాకు వెళ్తున్న 45 మంది హైదరాబాదీయులు బస్సు ప్రమాదంలో సజీవదహనం కావడంపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. ఒక డ్రైవర్ చేసిన తప్పిదానికి ఎంతో మంది మృతి చెందడం మనసును కలిచివేస్తుందని, అంతేకాకుండా హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి నసీరుద్దీన్ కుటుంబానికి చెందిన 18 మంది ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకర ఘటన అని అన్నారు. అక్కడి ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు మరోసారి జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు.

విశాఖ ఉక్కు పేరెత్తే అర్హత జగన్‌కు లేదు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ ప్లాంట్ ఆస్తులను, భూములను అమ్మకానికి పెట్టిన జగన్ అండ్ కో, ఇప్పుడు నీతి వాక్యాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మొత్తం ఉక్కు ఫ్యాక్టరీని గంపగుత్తుగా రూ. 500 కోట్లకే పోస్కో సంస్థకు ధారాదత్తం చేయాలని చూసిన వారు ఇప్పుడు మాయ మాటలతో రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని లేపేసి ఆ ప్రాంతంలో రాజధాని కడతామన్నప్పుడు విశాఖ ఉక్కు సంస్థ పరిరక్షకులు, కార్మిక పక్షపాతులు నోరెత్తలేదేమని ప్రశ్నించారు. విశాఖ ఉక్కుపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యల్ని వక్రీకరిస్తున్నారని, ఒక పబ్లిక్ సెక్టార్ సంస్థకు దేశంలో ఏ ప్రభుత్వం, ఏ నాయకుడు చేయని సాయం చంద్రబాబు చేశారనే నిజాన్ని గ్రహించాలని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

వీరుల మహోత్సవాలను జయప్రదం చేయండి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్నాట అత్యంత వైభవోపేతంగా నిర్వహించే చారిత్రాత్మక ఉత్సవాల్లో ఒకటైన కారంపూడి వీరుల మహోత్సవాలను జయప్రదం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం మాచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు, వీరాచారవంతులు పెద్ద సంఖ్యలో వస్తారన్నారు. ఉత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్నదాత సుఖీభవతో రైతుకు నిజమైన భరోసా

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్‌రెడ్డి వంచనలతో మోసపోయిన రైతుకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవతో నిజమైన భరోసా వచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. వైసీపీ రైతు భరోసా పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి హంగామా చేశారని, కానీ వాస్తవానికి అందిన డబ్బుల్లో ఎక్కువ భాగం కేంద్రం ఇచ్చిందేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం స్వయంగా వైఎస్ఆర్ జిల్లాలోని కమలాపురం నియోజకవర్గం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించి, రైతు ఖాతాలలో నిధులు జమ చేస్తారన్నారు. ఒక్కో రైతు ఖాతాలో కేంద్రం వాటా రూ. 2 వేలు, రాష్ట్ర వాటా రూ. 5 వేలు మొత్తం కలిపి రూ. 7 వేలు ప్రభుత్వం జమచేస్తుందన్నారు.

ఏఎన్‌యూ ఫార్మసీలో క్రికెట్ పోటీలు

ఏఎన్‌యూ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్స్‌లో భాగంగా మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ (ఏఎన్‌యూ) ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తేజో మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజో మూర్తి మాట్లాడుతూ, బుధవారం ఫార్మసీ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అధికారులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ర్యాలీని ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడబ్ల్యూ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్. మస్తానమ్మ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్, పావని, దివ్య భార్గవి, రజిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

గొంతునులిమి భార్యను చంపిన భర్త



లక్ష్మీపార్వతి (ఫైల్)

మంగళగిరి సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో మంగళవారం కట్టుకున్న భార్యను ఆమె భర్త గొంతు నులిమి హత్య చేశాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కిలిమి శంకర‌రెడ్డి, లక్ష్మీపార్వతి (29)కు ఐదేళ్ల కిందట వివాహమైంది. వారి దాంపత్య జీవితంలో కలహాలు రావడంతో ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపార్వతి మంగళగిరి మండలం చినకాకాని గ్రామానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేస్తూ ఎర్రబాలెం గ్రామంలో నివాసం ఉంటోంది. మంగళవారం భర్త శంకర‌రెడ్డి లక్ష్మీపార్వతి నివాసానికి వచ్చి దాడి చేయడంతో బాధితురాలు కేకలు పెడుతూ పక్కింట్లోకి పారిపోయింది. శంకర‌రెడ్డి ఆమె వెంటపడి లోపల నుంచి తలుపు గడియ పెట్టి గొంతు నులిమి హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ బ్రహ్మం, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ పరిశీలించి, మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. నిందితుడు పరారీలో ఉండగా, రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

47,667 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,885 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,667 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,907 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	14000
334	10000	18000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	16000	334	10500	17500
273	----	----	నెంబరు. 5	10000	16500
341	10000	17500	341	10500	18000
4884	----	----	4884	11000	14600
సూపర్ 10	----	----	సూపర్ 10	10500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	16000	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18200	దేవనూరు డీలక్స్	10500	17500
దేవనూరు డీలక్స్	10500	17000	తాలుకాయలు	5000	9000

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

పిడుగురాళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరాలపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మట్టి పనులు చేయించినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై డీఈవో చంద్రకళ మంగళవారం స్పందించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం వడితె రాజునాయక్, పీడీ అశోక్‌కుమారిలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఈ అంశంపై అధికారులతో కమిటీ వేసి సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని డీఈవో పేర్కొన్నారు.

భోళాలింగేశ్వరుని దేవాలయంలో బిల్వార్చన

● 5 కోట్ల ఒత్తులతో దీపారాధన


కోట్ల ఒత్తులతో దీపారాధన

పిడుగురాళ్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సున్నంబట్టీల సమీపంలో ఉన్న భోళాలింగేశ్వరుని దేవాలయంలో మంగళవారం కార్తీక మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామికి బిల్వార్చన, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోళాలింగేశ్వరునికి, పార్వతీదేవికి వివిధ రకాల ఫలపుష్పాలతో విశేషంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల తరువాత 5 కోట్ల ఒత్తులతో ఆలయం ఆవరణలో దీపారాధనలు చేశారు.

టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా విజయ్

దుర్గి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా దుర్గికి చెందిన కందుల విజయ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం విజయ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి రుణపడి ఉంటానన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి దళితులకు చేసిన దుర్మార్గాలను దళితులకు వివరించి వారిలో చైతన్యం నింపి టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

కంటి వైద్యశిబిరం

ముప్పాళ్ళ నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ముప్పాళ్ల బ్రాంచి మేనేజర్ ఇంజర్ల శోభరాజు అన్నారు.సెంట్రల్ బ్యాంకు ముప్పాళ్ల బ్రాంచి ఆధ్వర్యంలో మంగళవారం నర్సరావుపేటలోని డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ శోభరాజ్ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సెంట్రల్ బ్యాంకు ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించడంపై ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరానికి సహకరించిన హస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందికి, ఖాతా దారులకు బ్యాంకు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

రాగివైరు చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వెల్దుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి వాటిలో రాగివైరు చోరీకి పాల్పడిన నిందితుడిని వెల్దుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణానికి చెందిన ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు రాగివైరు చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతడ్ని అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నిందితుని వద్ద నుంచి 156 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్న వెల్దుర్తి పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని మండెపూడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15,750 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో ఎస్ఐ అమీర్ తమ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ అచ్చియ్య తెలిపారు.

జూదస్థావరంపై దాడి

మాచర్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోప్‌లైన్ కాలనీలో పేకాట స్థావరంపై మంగళవారం పట్టణ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3010లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ అనంతలక్ష్మి తెలిపారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

సత్తెనపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జిల్లా సమన్వయ కర్తలు శివ పార్వతి, గోపీలు అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో పర్యావరణ, సంక్షేమ, మౌలిక సౌకర్యాల కార్యదర్శులకు, పారిశుధ్యం మేస్త్రిలకు ప్లాస్టిక్ నిర్మూల, ఘన వ్యర్థాల నిర్వాహణ, స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి అంశాలపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వచ్చిన శిక్షకులు తిరుపతిరావు, హరీష్‌రావులు వివరించారు. పట్టణంలో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించి ప్లాస్టిక్‌ను వాడకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకో వాలన్నారు. వృత్తిలో తమదైన ముద్ర వేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలన్నారు. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సత్తెనపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. పట్టణంలోని 5వ వార్డు ముఖ్యనాయకులతో, సచివాలయ ఉద్యోగులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కన్నా మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను కూటమి నాయకులు ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. వార్డులో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కన్నా తెలియజేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించాలన్నారు. ఇంకా వివిధ అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే కన్నాతో పాటు చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, నూర్ బాషా జానీ బాబు, వార్డుకు చెందిన నేతలు పాల్గొన్నారు.


5వ వార్డులో జరిగిన కూటమి నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సీఎం సహాయ నిధితో పేదల ఆరోగ్యానికి భరోసా

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలోని ప్రజావేదికలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన 23 మందికి రూ.14.64 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసాను ఇస్తుందన్నారు. సీఎం సహాయనిధిని అందిస్తూ వారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, కోమటినేని శోభారాణి, మొక్కపాటి రామచంద్రరావు, కట్టా శంకరరావు, కల్లం వీర భాస్కర్ రెడ్డి, రాంబో బుడే, నూర్‌బాషా జానీబాబు, పూజల వెంకట కోటయ్య తదితర నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కదులుతున్న పులిచింతల ఫైలు

● 92 కుటుంబాలకు వన్ టైమ్ సెటిల్‌మెంట్
● 74 కుటుంబాలకు పునరావాస ప్యాకేజీ
● ఆర్‌అండ్ఆర్ జేడీ శ్రీలతకు గ్రామస్థుల వినతి


ఆర్‌అండ్ఆర్ జాయింట్ డైరెక్టర్ శ్రీలతకు అర్జీ ఇస్తున్న వేమవరం గ్రామస్థులు

మాచవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పులి చింతల ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలకు సంబంధించి ఫైలు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో కదులుతుంది. గత వైసీపీ ప్రభుత్వ పరిపాలన కాలంలో అడుగు కూడా ముందుకు కదలని పులిచింతల సమస్యల ఫైలు నేడు యరపతినేని చొరవతో త్వరలో పరిష్కారం కానున్నది. రెండు రోజుల క్రితం మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొలగాని శివ, ఏసుపొంగు ఆనందరావు, షేక్ జానీ తదితరులు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విజయవాడలోని ఆర్ అండ్ఆర్ కమిషనర్ ఆఫీసుకు వెళ్లి జాయింట్ డైరెక్టర్ శ్రీలతకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వేమవరంలో దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న 92 మంది లబ్ధిదారులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్, 74 ఎస్సీ కుటుంబాలకు చెందిన పునరావాస ప్యాకేజీ సమస్యలను జాయింట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 2017, 2018 సంవత్సరాల్లో యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రేగులగడ్డ, వెల్లంపల్లి, వేమవరం, గోవిందాపురం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి కుటుంబాలకు వంద కోట్ల రూపాయలు వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద నిధులు మంజూరు చేయించి పులిచింతల ప్రాజెక్టు ముంపు బాధితులకు న్యాయం చేశారు. తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో బాధితుల సమస్యలు పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పులిచింతల సమస్యలను యరపతినేని దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన యరపతినేని అతి త్వరలో పులిచింతల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, బాధితులకు హామీ ఇవ్వటమే కాకుండా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనికి స్పందించిన అధికారులు త్వరలోనే పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపుకు గురైన బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

శరవేగంగా నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

● జలవనరుల శాఖ ఈఈ రమేష్


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఈ రమేష్

విజయపురిసౌత్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాగర్ క్యాంపు మత్స్యకారుల కాలనీలో రూ.2.6 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు జలవనరుల శాఖ ఈఈ రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృషితో సాగర్ ప్రాజెక్ట్ కాలనీ రహదారులకు రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. రూ.2.4 కోట్లతో సుమారు 2.5 కి.మీ. ఎయిర్ స్ట్రిప్, బయ్యారం రహదారులను నిర్మించగా, రూ.2.6 కోట్లతో 2.8 కి.మీ. మేర నిర్మిస్తున్న సాగర్ క్యాంపు మత్స్యకారుల కాలనీ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం కాంట్రాక్టర్ ప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ మురళీధర్, ఏఈ సుధాకర్, విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, ఎరుపల్లి వెంకటేశ్వర్లు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీ

పలు గ్రామాల్లో చిరు వ్యాపారులపై కేసులు


మూసి వేసిన దుకాణాలు

క్రోసూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తూనికలు, కొలతల శాఖ అధికారుల రాకతో మంగళవారం క్రోసూరులో వ్యాపారులు దుకాణాలు మూసి వేసి పరుగులు పెట్టారు. అధికారుల రాకను ముందుగానే పసిగట్టిన వ్యాపారులు షాపులు మూసివేసి అక్కడి నుంచి పరారయ్యారు. ముఖ్యంగా బంగారపు దుకాణాలు, కిరాణా షాపులు, పచారి దుకాణాలు మూసి వేయటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లా డిప్యూటీ కంట్రోలర్ బీవీ హరి ప్రసాదు ఆదేశాలతో సత్తెనపల్లి తూనికలు, కొలతల శాఖ అధికారి జాన్ సైదా నేతృత్వంలో అధికారులు తనిఖీలకు వచ్చారు. షాపులు మూసివేయటంతో అధికారులు విస్తుపోయారు. అనంతరం పీసపాడు, 88 తాళ్ళూరు, గుడిపాడు గ్రామాల్లో పలువురు చిరు వ్యాపారులపై కేసులు నమోదు చేసి వెళ్లిపోయారు. పీసపాడు గ్రామంలో ప్రైవేట్ పత్తి వ్యాపారుల తూకాల్లో తేడాలు రావటంతో నాలుగు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. గుడిపాడులో కూల్ డ్రింక్స్ షాపులో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టుగా కేసు, 88 తాళ్ళూరులో ఎరువుల షాపును తనిఖీ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. క్రోసూరులో రోడ్డు పక్కన ఉన్న పొగాకు దుకాణంపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

దాతల సహకారంతో పాఠశాల భవన నిర్మాణం

దాచేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వారధి ఫౌండేషన్ సభ్యులు దుబాయ్‌లో నివాసం ఉంటున్న సుంకు శ్రీలత, కృష్ణ సాయిలు పాఠశాలలోని తరగతి గది నిర్మాణానికి ఆర్థిక సాయంతో నిర్మించిన భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. దాచేపల్లి నగర పంచాయతీలోని మాదినపాడు రోడ్డులో ఎంపీపీ ఎస్సీ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు కూర్చోవడానికి గది లేకపోవటంతో విద్యార్థుల తరగతి గదుల్లోనే హెడ్ మాస్టరు కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఇబ్బందులను వారధి ఫౌండేషన్ సభ్యులు దృష్టికి తీసుకెళ్లడంతో సుంకు సత్యసాయి ప్రకాష్, శ్రీలత, కృష్ణ సాయిలు తెలుసుకొని రూ.లక్షా 33వేల నిధులు అందజేశారు. ఈ నిధులతో తరగతి గది, బీరువా, ఆఫీస్ టేబుల్, చైర్, పాఠశాల విద్యార్థులకు ఆడుకొనేందుకు ఆట స్థలానికి మొరక తోలారు. పూర్తి చేసిన తరగతి గదిని వారధి ఫౌండేషన్ అధ్యక్షులు టీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈవో-1, 2 శ్రీనివాసరెడ్డి, పినాకపాణి, దాచేపల్లి క్లస్టర్ హెచ్ఎం సాంబశివరావులు ప్రారంభించారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ చిత్తు

● ప్రిన్సిపాల్ ఫాదర్ ఎలీషా రాజ్

రెంటచింతల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటితో జీవితం నాశనమౌతుందని సాగరమాత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఎలీషారాజ్ అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో మాదక ద్రవ్యరహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి విద్యార్థికి ఇంటర్ విద్య కీలకమని పేర్కొంటూ స్నేహితులందరూ మంచి నడవడికతో వ్యవహరిస్తూ వ్యసనాలకు బానిసలు కావొద్దని సున్నితంగా హెచ్చరించారు. మత్తుతో భవిష్యత్ చిత్తవుతుందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు డేగల శ్యామ్, కమర్, గోవిందు, వనజ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలను పాటించాలి

పెదకూరపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చి వేసిన రైతులు ఉద్యానశాఖ అధికారుల సూచనలను పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని డాట్ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్టు కో-ఆర్డినేటర్ నగేష్ అన్నారు. మండలంలోని కాశిపాడులో మిర్చి పంట వేసిన రైతులకు మంగళవారం మిరప సాగులో సమగ్ర సస్యరక్షణా చర్యలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నగేష్ మాట్లాడుతూ మిరప ఆకుల అడుగు భాగాన తామర పురుగుల తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి రసం పీల్చి నష్టాన్ని కలుగ చేస్తాయన్నారు. రసం పీల్చే పురుగులైన నల్ల తామర పురుగు, తెల్ల దోమ, నల్లి, పేనుబంక నివారణకు జాగ్రత్తలను వివరించారు. ఉద్యానశాఖ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరుడికి కార్తీక మాస శివరాత్రి పూజలు

నకరికల్లు నవంబరు 18 ఆంధ్రజ్యోతి: కార్తీక మాస శివరాత్రి పురస్కరించు కొని మంగళవారం మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో ఉన్న గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. కార్తీక స్నానమాచరించి కార్తీక దీపాలు వెలిగించారు. దేవాలయంలోని వినాయక స్వామిని, గంగా పార్వతీ అమ్మవారిని, మల్లేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజలను అర్చకుడు కళ్యాణశివం నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో గుండ్లపల్లిలోని మల్లేశ్వర స్వామి

విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

● ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు

రెంటచింతల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి ఈనెల 26వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంఈవో-2 శివనాగేశ్వరరావు చెప్పారు. పాఠశాలల్లో సిగ్నల్స్ రాకపోవడం వల్ల పాలువాయిలోని సచివాలయం, రెంటచింతల 2 సచివాలయాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 4600 మంది బాలబాలికలు ఇంకా ఆధార్ అప్డేట్ చేయించుకోలేదన్నారు.

వాగులో స్నానానికి దిగి అయ్యప్ప మాలధారి మృతి

క్రోసూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం ఎద్దు వాగులో మధ్యాహ్నం స్నానానికి వెళ్లి అయ్యప్ప మాలధారి మరణించిన ఘటన మంగళవారం జరిగింది. ఈ సంఘటనలో బయ్యవరం గ్రామానికి చెందిన దుప్పల వెంకటేశ్వర్లు (20) అనే యువకుడు మరణించాడు. గ్రామానికి చెందిన దుప్పల రమేష్, శివమ్మల ఒక్కగానొక్క కుమారుడు వెంకటేశ్వర్లు అయ్యప్పమాల ధరించగా ఆయన తండ్రి రమేష్ భవానీ మాల ధరించాడు. వెంకటేశ్వర్లు ఉధృతంగా ప్రవహిస్తున్న బయ్యవరం ఎద్దు వాగులో రెండు గంటల సమయంలో స్నానానికి దిగినట్టు గ్రామస్థులు తెలిపారు. మధ్యలో గుంత ఉండటంతో అందులో పడి మరణించినట్టు స్థానికులు తెలియజేశారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని స్థానికులు వెలికితీశారు. సంఘటన గురించి తమకు ఎటువంటి సమాచారం అందలేదని పోలీసులు తెలియజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1972-1973 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

విజయపురిసౌత్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో మంగళవారం 1972-1973 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువు హరినాథ్‌బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోలా వసంత్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో-1 కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు బీరువా అందజేత

మాచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల మాజీ అధ్యక్షుడు వీరమాచినేని సుభాష్ చంద్రబోస్ జ్ఞాపకార్థం మండాది రోడ్డులో గల కస్తూర్బా బాలికల విద్యాలయానికి రూ.15 వేల విలువైన ఇనుప బీరువాను మంగళవారం రోటరీ క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు తుమ్మల సత్యప్రసాద్ ద్వారా క్లబ్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 3150 డిసీజెస్ అండ్ ప్రివెన్షన్ చైర్మన్ కొండవీటి రామకోటయ్య, క్లబ్ సెక్రటరీ ఆలేటి కోటేశ్వరరావు, పఠాన్ నాగూర్‌వలి, ఇక్కుర్తి శంకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలి

● ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపాల్ నయింబాను


గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రిన్సిపాల్ నయింబాను తదితరులు

విజయపురిసౌత్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపాల్ నయింబాను అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాచరన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నయింబాను విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి ఎస్‌కేఎండీ బాషా, డిప్యూటి వార్డెన్ సతీష్‌బాబు, లైబ్రేరియన్ తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, దుర్గి గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

● క్రోసూరు: జూనియర్స్ విభాగంలో మనం మన ఆరోగ్యం అంశంపై వ్యాస రచన, సీనియర్స్ విభాగంలో గ్రంథాలయాలు, విద్యార్థుల బాధ్యత అనే అంశంపై పోటీలు నిర్వహించారు.

● అమరావతి: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు.

● అచ్చంపేట : బీఆర్ అంబేద్కర్ గురుకుల, కస్తూర్బా బాలికల పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్, వక్తృత్వం, డ్రాయింగ్ మొదలైన పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయ శాఖ అధికారి బీ నాగరాజు తెలిపారు.

● పిడుగురాళ్ల : వారోత్సవాల సందర్భంగా జమున స్కూల్ విద్యార్థులకు క్విజ్, ఆటలపోటీలు నిర్వహించారు. పుస్తకపఠనంపై ఆసక్తి కలిగివుండాలని గ్రంథాలయ అధికారి రాజశేఖర్ తెలిపారు.

దాతలు ముందుకొస్తే పేదరికం దరిచేరదు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా నగదు అందజేస్తున్న బాలకృష్ణ, నరేష్‌లు

వెల్దుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం అడిగొప్పులకు చెందిన ఎన్ఆర్ఐ యాగంటి బాలకృష్ణ, టీడీపీ మండల యువనేత యాగంటి నరేష్‌ల సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. అడిగొప్పుల గ్రామానికి చెందిన మాశెట్టి భాస్కరరావు అనే విద్యార్థికి ఉన్నత చదువులకు ఆర్థికభారం కావడంతో విషయం తెలుసుకున్న బాలకృష్ణ, నరేష్‌లు పీ-4 కుటుంబం ద్వారా విద్యార్థిని చదివించేందుకు ముందుకొచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి సమక్షంలో పీ-4 బంగారు కుటుంబం ద్వారా విద్యార్థిని దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. అలాగే బాలకృష్ణ, నరేష్‌లు చెరో రూ.50 వేల చొప్పున మొత్తం రూ.లక్ష నగదును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ-4 విధానంలో దాతలు ముందుకు వస్తే పేదరికం దరిచేరదన్నారు. మార్గదర్శులుగా నిలుస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యాగంటి బాలకృష్ణ, నరేష్‌లను అభినందించారు.

పట్లవీడులో అయ్యప్ప స్వామి పడిపూజ


అయ్యప్పస్వామి అభిషేకాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు

వెల్దుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్లవీడులో టీడీపీ సీనియర్ నేత బత్తుల అంకమ్మరావు ఆధ్వర్యాన సోమవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు పాల్గొని పంచామృతాలు, వివిధ రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన


నరసింగపాడులో ప్రత్యేక అలంకరణలో గంగా అన్నపూర్ణాదేవి


ప్రత్యేక అలంకరణలో మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి

నకరికల్లు, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి) : నరసింగపాడులో ఉన్న గంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళ వాయిద్యాలతో వేద మంత్రోచ్చారణల మధ్య ఉత్సవాలను ప్రారంభించారు. గోపూజ చేశారు. గణపతి పూజతో ప్రారంభించి పుణ్యాహ వాచనం, రుద్విరణం, పంచగవ్య ప్రాసనం చేశారు. మహన్యాస పారాయణం నిర్వహించారు. చండీ పారాయణం చేశారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పుణ్య దంపతులు పూజలు చేశారు. రుద్రహోమం, చండీ హోమం నిర్వహించారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజ చేశారు. నందీశ్వరునికి అభిషేకం జరిపారు. మరకతలింగ చంద్రమౌళేశ్వర స్వామికి అర్చకులు విశేష అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. గంగా అన్నపూర్ణాదేవిని విశేషంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల నిర్వాహణ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పమిడిమర్రి శ్రీనివాసశర్మ నిర్వహించారు.

శివాలయంలో కార్తీక మాస పూజలు


మాచవరం శివాలయంలో హోమగుండాల వద్ద పూజలు చేస్తున్న మహిళలు

మాచవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాచవరంతో పాటు పలు గ్రామాల్లో కార్తీకమాసం సందర్భంగా పూజా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. మాచవరం చెన్న మల్లేశ్వర స్వామి దేవాలయంలో పూజారి బెల్లంకొండ సత్యానంద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. అభిషేకాలు చేశారు. అనంతరం శివాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● మాచవరం రెవెన్యూ కార్యాలయ ఆధ్వర్యంలో మండలంలోని మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో రెవెన్యూ శాఖ వారి ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి, ఆర్ఐ ముక్కంటి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం రాత్రి చినఅగ్రహారంలోని శ్రీగంగాపార్వతి సమేత చంద్రమౌలేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అనువంశిక అర్చకస్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆదివాసి దళితులపై దాడులను తక్షణమే నిలిపి వేయాలి

దాచేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలు, ఆదివాసీయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దాచేపల్లి తహసీల్దార్‌కు శ్రీనివాస్ యాదవ్ వినతి పత్రం అందజేశారు. హుస్సేన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీలు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు జరిగాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, కొమెర వెంకటరావు, పత్తిపాటి వెంకట నాగరాజు, కొండలు, నాసరయ్య, బుర్రి కృష్ణారెడ్డి, తెల్లనాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణకు విఫలయత్నం

నాదెండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు అపహరించేందుకు యత్నించిన ఘటన గణపవరంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన నంబూరి శేషమ్మ అనే వృద్ధురాలు కిరాణా షాపు నుంచి నిత్యావసరాలు తీసుకుని వస్తుండగా కాండ్రు వారి వీధి సమీపంలో గుర్తు తెలియని ఒక యువకుడు మోటారు బైక్‌పై వచ్చి శేషమ్మ మెడలోని బంగారు గొలుసు లాగేందుకు యత్నించాడు. ఈ క్రమంలో శేషమ్మ కిందపడి కేకలు వేయటంతో యువకుడు పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న నాదెండ్ల పోలీసులు గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వ్యభిచారం కేసులో ఆరుగురి అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ఓ లాడ్జిలో వ్యభిచారానికి పాల్పడుతున్న మూడు జంటలను అదుపులోకి తీసుకున్నట్లు మొదటి పట్టణ ఎస్ఐ అరుణ మంగళవారం తెలిపారు. మహిళలను రెస్క్యూ హోంకు తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ముగ్గురు విటులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తికి గాయాలు

వినుకొండ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి కిందపడి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని చీకటీగలపాలెం రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం చోటు చేసుకుంది. వైద్యశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న శ్యాంసుందర్ చత్రపతి శివాజీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ కిందపడటంతో 108 సిబ్బంది సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రగాయాలు కావడంతో మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో వివరాలు తెలియరాలేదు.

మద్యం కేసులో ఒకరిపై బైండోవర్

ఈపూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అంగలూరు గ్రామానికి చెందిన ఒకరిపై మద్యం కేసులో బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

వైసీపీ నేత దరియావలిపై కేసు

చిలకలూరిపేట, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణ వైసీపీ శాఖ అధ్యక్షుడు షేక్ దరియావలిపై అర్బన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. 24వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మస్తాన్ వలితో జరిగిన ఘర్షణ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. కేబీ రోడ్డులో ఇద్దరి దుకాణాలు పక్కపక్కనే ఉంటాయి. వ్యర్థాలు పడవేసిన విషయంలో వివాదం ఏర్పడి దరియావలి తనపై దాడి చేశాడని, తనకు ప్రాణహాని ఏర్పడిందని మస్తాన్‌వలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరుగుదొడ్ల తనిఖీ

వినుకొండటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, మున్సిపల్ ఏఈ ఆదినారాయణ పట్టణంలోని పలు టాయిలెట్లను తనిఖీలుచేసి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

పాఠశాలలో డీవైఈవో తనిఖీ

నాదెండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఉప విద్యాశాఖ అధికారి సుభానీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అమలుచేస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయనతో పాటు హెచ్ఎం నిర్మల, తదితరులు ఉన్నారు.

నేడు మండల స్థాయి సమీక్ష

బొల్లాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేడు సమాఖ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో పీ మాధురి మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, హౌసింగ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, అంగన్‌వాడీ తదితర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరు కావాలని సూచించారు. కాగా ఈ సమావేశానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రానున్నట్లు ఆమె తెలిపారు.

జేసీబీ స్వాధీనం

రొంపిచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం సమీపంలో అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీని మైనింగ్ శాఖ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులకు జేసీబీని అప్పగించారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.25వేలు సాయం

చిలకలూరిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుండె వైద్య చికిత్స పొందిన స్థానిక ల్యాబ్ టెక్నీషియన్ పి.బాబుకు మంగళవారం చిలకలూరిపేట ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ఓనర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. సంఘ సభ్యుల వద్ద నుంచి విరాళాలు సేకరించి ఈ సాయాన్ని బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.చిన్న, వెంకటేశ్వరరావు, ఆయా ల్యాబ్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

పేటలో పెన్షనర్ల సంఘం సేవలు

చిలకలూరిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫైర్ స్టేషన్ రోడ్డులో ఉన్న పెన్షనర్ల సంఘంలో సభ్యులుగా నమోదై సంఘం సేవలు పొందాలని కే మురళీధరరావు, జి వెంకటప్ప మంగళవారం కోరారు. పెన్షనర్లు 92466 62535, 90106 07048 నంబర్లకు ఫోన్‌చేసి అవసరమైన సేవలు, సలహాలు పొందవచ్చన్నారు.

శ్రీనివాసరావుకు గోనుగుంట్ల నివాళి

రొంపిచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లకు చెందిన గోనుగుంట్ల శ్రీనివాసరావు మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు బకాయిలపై నివేదికలివ్వండి

● అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

నరసరావుపేట లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు సంబంధించిన అన్ని బకాయిలు, క్లెయిములను 15 రోజుల్లోగా పూర్తిచేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ నిధులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ వైద్య సేవలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ విభాగంలో డీఈవోల కొరత ఉన్న ఖాళీలను నియామకాల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రుల మెడికల్ సూపరింటెండెంట్‌లను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌పై నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు విభాగంలో డీఈవోలకు ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన జిల్లాలోని ప్రాంతీయ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

వైభవంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వర స్వామి

రొంపిచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి దేవస్థానంలో మాస శివరాత్రి పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రొంపిచర్లలోని శంకరస్వామి ఆలయంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలను నిర్వహించి, అన్నదానం చేశారు.

ఘనంగా జ్యోతులతో లింగార్చన

వినుకొండ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్‌లోని దేవస్థానంలో షిరిడి సాయిబాబా మందిరంలో కార్తిక మాసం సందర్భంగా జ్యోతులతో లింగార్చన చేపట్టారు. 30అడుగుల వెడల్పు 60 అడుగుల పొడవైన శివలింగం ఆకారాన్ని ప్రముఖ చిత్రకారులు బొడ్డు చర్ల ప్రసాదు చిత్రించారు. పట్టణానికి చెందిన శంకర్ సత్సంగం మహిళా భక్తులు స్వామి వారికి సహాయ సహకారాలు అందించారు 6వేల ప్రమిదలతో ఒక్కొక్క ప్రమిదకు పదివేల ఒత్తులు కట్టతో దీపాలు వెలిగిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు పోతుకూచి వెంకట శ్రీనివాసరావుశాస్త్రి తెలిపారు. కార్యక్రమంలో దోగిపర్తి వెంకటప్రసాదరావు, కొల్లిపర బాలసుబ్రమణ్యం, సన్‌శెట్టి గురవయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సాయిబాబా దేవస్థానంలో 6వేల ప్రమిదలతో తయారు చేసిన శివలింగాకారం

● వినుకొండ టౌన్: కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో సకలజనుల కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో 11వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి స్పటిక రామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణం విశ్వమాత గోసంరక్షణ ఆశ్రమంలో తెల్లవారుజామున పంచామృత మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఆలయ మహిళా సేవకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చండీ శాంతి హోమాన్ని 9మంది దంపతులు కూర్చొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పొట్లూరు సైదారావు, నల్లబోతు రామకోటేశ్వరావుతో పాటు, నిర్వాహకులు, మహిళా భక్త బృందం పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డులోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో నెల రోజులుగా కార్తికమాసం సందర్భంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది సీహెచ్.ఎల్.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో దేవస్థానం ఆవరణలో మంగళవారం సకలజన సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాదులు సైదారావు, రామకోటేశ్వరరావు, న్యాయవాదులు వ్యాపారవేత్తలు కళాకారులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ సుహాసిని

శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొనియున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల గైర్హాజరుతో ఎప్పటిలానే సమావేశం తూతూమంత్రంగానే ముగిసింది. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అధికారులంతా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు ఉన్నతమైన సేవలందించాలన్నారు. ఇన్‌చార్జి ఎంఏవో రామారావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో 6539మంది రైతులకు రూ.4.16కోట్లు లబ్ధి చేకూరనుందని తెలిపారు. వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, మండల కోఆప్షన్ మెంబర్ హుస్సేన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు

ఎస్ఎస్ఎన్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పుస్తక, మహాత్మా గాంధీ జీవిత చరిత్రపై ఫొటో, ప్రపంచంలో ప్రముఖ శాస్త్రవేత్తల ఫొటో ప్రదర్శన జరిగింది. కార్యక్రమాన్ని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా ప్రారంభించారు. గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ నెల రోజుల పాటు అందుబాటులో ఉంటుందని, పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు, కళాశాలల, పాఠశాలల విద్యార్థులు సందర్శించవచ్చునని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ తెలియజేశారు.

● శావల్యాపురం: 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శావల్యాపురంలోని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాయాధికారి రావూరి శ్రీనివాసరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు కోటేశ్వరరావులు విజేతలను ఎంపిక చేశారు.

● బొల్లాపల్లి: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బొల్లాపల్లి కస్తూర్బా పాఠశాల నుంచి మంగళవారం ఐదో రోజు విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యాలయ ప్రిన్సిపాల్ లీలావతి, గ్రంథాలయ అధికారి రామావత్ సేవా నాయక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా యడ్లపాడు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ పోటీలలో యడ్లపాడులోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సామాజిక సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, ఎంపీపీ (ఎస్టీ) స్కూల్ హెచ్ఎం బి.పుష్పవతి, ముత్తూట్ ఫైనాన్స్ యడ్లపాడు శాఖ మేనేజర్ బి శివశంకర్‌లు పాల్గొన్నారు. కార్యక్రమాలను గ్రంథాలయ అధికారి చేవూరి అంజమ్మ పర్యవేక్షించారు. పాఠకులు ఎడ్లూరి సంజీవరావు, జరుగుల నాగేశ్వరరావు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

● ఈపూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఈపూరు, ముప్పాళ్ళ శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మీసాల ప్రసాద్, గ్రంథాలయ అధికారులు నాగలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, సోషల్ మీడియా వలన లాభ నష్టాలుపై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. విజేతలు పీ నాగజ్యోతి, ఎం శృతి, యు దేవివాణిలకు కళాశాల డైరెక్టర్ కే నాసరయ్య, ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వర్లు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, డాక్టర్ డీ యోగేశ్వరరావు, లైబ్రేరియన్ కేఎంఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ, ఉపాధ్యాయులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● రొంపిచర్ల: రొంపిచర్ల శాఖా గ్రంథాలయంలో మంగళవారం జడ్పీ పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి పర్యవేక్షించారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు కె.వెంకట్రావు, హెచ్ఎం మధుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వినుకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉప్పరపాలెం, చాట్రగడ్డపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి మాట్లాడుతూ కంది పంట సాగుచేసిన రైతులు పైరుని గమనించి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్, వీపీఏ మౌనిక రైతులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శివలలిత వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● నాదెండ్ల: సహకార వ్యవస్థ పటిష్టతతోనే రైతులకు న్యాయం జరుగుతుందని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్ర మైన నాదెండ్ల సహకార సంఘం, క్రిబ్‌కో కంపెనీలు సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రామిరెడ్డి, క్రిబ్కో అధికారి సుబ్రహ్మణ్యం, ఇన్‌స్పెక్టర్లు స్వరూప, రవికుమార్, ఏవో శ్రీలత, సొసైటీ అధ్యక్షులు నల్లమోతు హరిబాబు, సీఈవో ధనలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని నరసరావుపేట నుంచి రొంపిచర్ల వెళ్ళే రహదారిలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనటంతో మంగళవారం ట్రాక్టర్ బోల్తాపడింది. నరసరావుపేట నుంచి అన్నవరం సమీపంలోని అట్టల ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ కంకర లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో పక్కనే ఉన్న కాలువలోకి పడిపోయింది. ఈ సంఘటనలో ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

● వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భువనగిరి సుబ్రహ్మణ్యం, ఆశ్రమ నిర్వాహకులు గుమ్మడి వెంకటేశ్వర్లు, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, తిరువాయిపాటి శేషయ్య, గుడిపాటి సాంబశివరావు, ఎంవీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

● కారుమంచి (శావల్యాపురం): పూణేలోని తపోవాడీలో జరిగిన ఆల్ట్రా ట్రైల్ మారథాన్ 50కిమీ రన్నింగ్ పోటీల్లో శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన ఇండియన్ ఆర్మీ జవాన్ పోల అంకమ్మరావు అలియాస్ విజయ్‌కుమార్ ప్రతిభని కనబరచి ప్రథమస్థానంలో నిలిచారు. 50 కిమీ మారథాన్ రన్నింగ్‌ను 4గంటల 51నిమిషాల్లో పూర్తిచేసి అంకమ్మరావు ప్రథమస్థానంలో నిలిచాడు.

● ఈపూరు: ఈపూరులోని ఏపీ మోడల్ స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వల్లపు శ్రీనివాసరావు 20మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు, మరో పదహారు మంది విద్యార్థులకు ఎస్ఎస్ఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో డి.జ్యోతి, ఎంఈవో 2 రామతులసి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వినుకొండ: ఎన్ఎస్‌పీ కాలనీలోని జడ్పీహెచ్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నూజెండ్ల మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి (బాబు) ఆర్థికసాయంతో మంగళవారం బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీహెచ్ వీరప్పయ్య, కంభంపాడు మాజీ సర్పంచ్ గంగినేని చంద్రశేఖరరావు, ములకలూరు మాజీసర్పంచ్ వెంకట్రావు, శ్రీనివాసరావు, రామయ్య, పద్మజ, పాఠశాల పీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోని ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ 40వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ 40 సంవత్సరాలుగా దివ్యాంగులకు, మానసిక వికలాంగులకు ప్రత్యేక విద్యా సేవలు అందించటం అభినందనీయం అన్నారు.

● ఈపూరు: ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు 19వ తేదీన విడుదల చేస్తున్నట్లు ఏవో ఆర్.రామారావు తెలిపారు. మండలంలో 8420మంది రైతులకు రూ.5.48కోట్లు విడుదల కానున్నాయన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఏఎంరెడ్డి విద్యాసంస్థలలో మంగళవారం ఎంఎం రెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐడియాతాన్ 2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీఐసీ కేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ సీఈవో రమణకాంత్, కేఎల్‌టీఐఎఫ్ సీఈవో బాబు హరికృష్ణ లంక ముఖ్యఅతిథులుగా హాజరు అయ్యారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో నరసరావుపేట నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఈగల్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శామ్యూల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తెలిసిన వారు మాదకద్రవ్యాల బారిన పడినట్లుయితే తక్షణసాయం, కౌన్సెలింగ్ కోసం 14446 హెల్ప్‌లైన్ సంప్రదించవచ్చన్నారు.

అన్న క్యాంటీన్‌కు ఆర్వో వాటర్‌ప్లాంట్ వితరణ

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌కు రూ.లక్ష విలువ చేసే ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంగళవారం దాతలు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. కోట మురళి మోహనరావు జ్ఞాపకార్థం భార్య కోట రాజ్యలక్ష్మి, కుమారుడు కోట లక్ష్మణ, సత్యవాణి దంపతులు, ఆదర్ష్, ఆదేష్‌లు ఈ ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, వనమా సాంబశివరావు, అత్తులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, దాతలు

మక్కాయాత్రలో ప్రమాదం దురదృష్టకరం

నరసరావుపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన మక్కా యాత్రలో జరిగిన ప్రమాదంలో 45మంది హైదరాబాదీయులు సజీవ దహనం కావడం దురదృష్టకరమని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.3.72 కోట్లు మంజూరు

చిలకలూరిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలోని 22పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.3.72కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం తెలిపారు. చిలకలూరిపేట మండలంలో 7పాఠశాలలకు రూ.2.07కోట్లు, నాదెండ్ల మండలంలో 10 పాఠశాలలకు రూ.1.32 కోట్లు, యడ్లపాడు మండలంలో 4 పాఠశాలలకు రూ.31లక్షలు, చిలకలూరిపేట పట్టణంలో ఒక పాఠశాలకు రూ.4లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ల్యాబ్‌లు, ప్రహరీల నిర్మాణం, కంప్యూటర్ రూముల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారన్నారు. మంత్రి లోకేశ్‌కు గతంలో చేసిన విజ్ఞప్తిపై స్పందించి, కేంద్రప్రభుత్వ సహకారంతో ఈ నిధులు మంజూరు చేశారన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పాస్టర్లు, సంఘస్థులు

ప్రతి విద్యాసంస్థను కాపాడుతాం

● ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ సెక్రటరీ టు కంట్రోలర్ జేసురత్నకుమార్

యడ్లపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి (ఏఈఎల్‌సీ)కి ఉన్న ప్రతి విద్యా సంస్థను తిరిగి నిలబెడతామని విశ్రాంత న్యాయమూర్తి, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ సెక్రటరీ టు కంట్రోలర్ ఎన్.జేసురత్నకుమార్ అన్నారు. యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలపై జరుగుతున్న వివాదం నేపథ్యంలో మంగళవారం స్కూల్ ఆవరణలో ఏఈఎల్‌సీ వెస్ట్ సెనేడ్ పరిధిలోని లూథరన్ సంఘాల పాస్టర్లు, సంఘ సభ్యులతో ప్రార్థనా సమావేశాన్ని నిర్వహించారు. మా స్కూల్ మా హక్కు అంటూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేసు రత్నకుమార్ మాట్లాడుతూ ఏఈఎల్‌సీకి చెందిన 190 పాఠశాలలు ప్రభుత్వానికి అప్పగించామని, మిగిలిన 24 విద్యాసంస్థల్ని మూతపడనివ్వమన్నారు.

స్కూలు అభివృద్ధి కమిటీపై ఆరోపణలు..

ప్రార్థనా సమావేశం అనంతరం ఏఈఎల్‌సీ ప్రతినిధులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధి కమిటీ (ఎస్‌డీసీ)పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో పాఠశాల యాజమాన్య బాధ్యతలను స్వీకరించిన తాము విద్యార్థులను చేర్చుకునే ప్రయత్నం చేస్తుంటే ఎస్‌డీసీనే అడ్డుపడిందన్నారు. లూథరన్ హైస్కూల్ అభివృద్ధి కోసం కేటాయించబడిన ఎండోమెంట్ భూమిని ఎస్‌డీసీ సభ్యులే లీజుకు తీసుకోవడం దారుణమని విమర్శించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు గ్రామంలో 144 సెక్షన్ విధించారు. గ్రామంలో డ్రోన్ కెమెరా నిఘా ఏర్పాటు చేశారు. సమావేశానికి లూథరన్ విద్యాసంస్థల కార్యనిర్వాహక ప్రతినిధి నీలం శ్యామ్యేల్‌మోజెస్, గుంటూరు వెస్ట్ సెనేడ్‌లోని పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

చిలకలూరిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను అరికట్టాలని, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు ఆధ్వర్యంలో నాయకులు ఎం.రాధాకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, సీపీఎం నాయకులు పేరుబోయిన వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఆర్పీఐ నాయకులు ముత్తయ్య, ముస్లిం యూనియన్ నాయకులు షేక్ బాజీ, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను నాయక్ పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

వినుకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా వినుకొండ శివయ్యస్తూపం సెంటర్‌లో సీపీఐ నియోజక వర్గ సమితి ఆధ్వర్యంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు రాయబారం వందనం, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జున, మస్తాన్‌వలి, డి.మరియబాబు, కాలేశా, నాగూర్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు

పంటకోత ప్రయోగాలను పారదర్శకంగా నిర్వహించాలి

● ఇన్‌చార్జి ఎంఏవో రామారావు

శావల్యాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆహార, ఆహారేతర పంటల ఉత్పత్తుల దిగుబడులను అంచనా వేసేందుకే ప్రభుత్వం దేశవ్యాప్తంగా పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తోందని, కాబట్టి వీఏఏలు పంటకోత ప్రయోగాలను పారదర్శకంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు అన్నారు. పంటకోత ప్రయోగాలపై స్థానిక రైతుసేవాకేంద్రంలో మంగళవారం మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఏవో మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగుచేసిన పంటలకు వీఏఏలు పంటకోత ప్రయోగాలు నిర్వహించి దిగుబడులు అంచనా వేయాలని, పంటకోత ప్రయోగాలు ఆధారంగానే ప్రభుత్వం రైతులకు పంటల బీమా, పంట నష్టపరిహారాలు అందజేస్తుందన్నారు. వీఏఏలు బీమా వర్తించే వరి, మినుము, మిరప, కంది పంటలను బీమా యాప్‌లో, బీమా వర్తించని పంటలను రాష్ట్ర యాప్‌లో విడివిడిగా బాధ్యతతో నమోదు చేయాలన్నారు.